క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని అడ్డపనస గ్రామంలో గల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయాన్ని, స్వామివారి మూల విరాట్‌ను అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాలను అందజేశారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ధర్మాన తేజ్‌కుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసిన యువత

నరసన్నపేట: చదువుకుని ఖాళీగా ఉన్న యువత గ్రామాల్లోనే వ్యాపారాలు ప్రారంభించి వాటిని అభివృద్ధి చేసుకోవచ్చని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ట్రైనర్ డిల్లీశ్వరరావు అన్నారు. స్థానిక డీఆర్ఎస్ కళాశాలలో మూడు రోజులుగా ఇచ్చిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న వ్యాపార అవకాశాలు గుర్తించాలన్నారు. ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసి మార్కెట్ మెలకువలు, నిర్వహణ, శక్తి సామర్థ్యాలు, ఖాతా పుస్తకాల నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిబిరంలో పాల్గొన్న 50 మందికి సర్టిఫికెట్లు అందించారు. డీఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, ఏపీఎస్ఎస్ డీసీ కోఆర్డినేటర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి



ప్రవచనాలు చెబుతున్న జనార్దన స్వామి

సారవకోట: ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని సద్గురు జ్ఞాన మందిరం పీఠాధిపతి జనార్దన స్వామి సూచించారు. మండలంలోని కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే ఈర్ష్య, దేషాలు తొలగిపోతాయని, దీని వలన సమాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎన్నో జన్మల అనంతరం మానవ జన్మ వస్తుందని, ఈ జన్మను సార్థకం చేసుకుని మోక్షం పొందాలన్నారు. సిద్దయ్య స్వామి, బాడాన అప్పారావు, తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

అధ్వానం



రాళ్లుతేలిన రహదారి

సరుబుజ్జిలి: మండలంలోని ఏడీ రోడ్డు నుంచి చినవెంకటాపురం వరకు సుమారు కిలోమీటరు మేర అధ్వానంగా ఉంది. ఆయా గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు చేసే ప్రజలు అవస్థలుపడుతున్నారు. 108 వాహనం గ్రామంలోకి రాకపోవడంతో రోగులను తరలించేదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సునీత

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతులకు విశిష్ట నంబర్ల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని, దీనికి రైతులు సహకరించాలని మండల వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. దూకులపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ నెలాఖరు కల్లా ఈ ప్రక్రియ పూర్తిచేసి, రైతులందరికీ వారి పేరున గుర్తింపు నంబర్లు ఇవ్వాలని వీపీఏలకు సూచించారు. రైతులు గమనించి సంబంధిత వీపీఏల వద్దకు ఆధార్, పాస్ బుక్ జిరాక్స్‌లు తీసుకునివెళ్లాలన్నారు. రబీ వరి, మొక్కజొన్న, నువ్వు, సన్‌ఫ్లవర్ పంటల్లో అధిక దిగుబడులు రావాలంటే తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వేసవిలో ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు.



అసాంఘిక కార్యకలాపాలకు .. అడ్డా..!



- రూపుకోల్పోయిన పొందూరు నెహ్రూ పార్క్
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మందుబాబులు పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు

పొందూరు: ఆహ్లాదం, ఆరోగ్యం కోసం పొందూరు పట్టణంలో 1964లో నెహ్రూ పార్క్ నిర్మించారు. ఈ పార్కులో ఒక భాగం చిన్నారులు ఆడుకునేందుకు అనువుగా, మరోభాగం పెద్దలు వాకింగ్ చేసుకునేందుకు ట్రాక్‌ను ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేశారు. బెంచీలను బాగు చేయించారు. ఈ పార్కులోనే మండల, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఇప్పటికీ పెడుతున్నారు. అధికారిక, గ్రంథాలయ సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికారులు ఈ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చి విస్మరిస్తున్నారు. ప్రస్తుతం పార్క్ రూపురేఖలు కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

మందుబాబుల హల్‌చల్..

పార్క్ గోడలకు అనుకుని ఉన్న దుకాణాలే ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్నాయి. పార్క్‌కు పది అడుగుల దూరంలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. సాయంత్రం అయితే చాలు మందుబాబులు పార్క్‌లో దర్శనమిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడే మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు పడేస్తున్నారు.

పందులు, చెత్తాచెదారానికి నిలయం..

పార్క్ సమీపంలో ఉన్న వారు ఇక్కడ పందులు, కోళ్లు, గొర్రెలను పెంచుతున్నారు. బుట్టలు అల్లుకుంటున్నారు. పాలకులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి పాములు, విష పురుగులకు నిలయంగా మారింది.

కేంద్ర మంత్రి హామీ గాలికి..

రూ.10 లక్షల ఎంపీ నిధులతో పార్కును అభివృద్ధి చేయనున్నట్లు ప్రస్తుత కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గతంలో ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పార్క్ అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పంచాయతీ సిబ్బంది, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవిస్తున్నారు.



పార్క్‌లో పందుల పెంపకం



తుప్పపట్టిన చిన్నారుల ఆట పరికరాలు



పొందూరు నెహ్రూ పార్కు ఇదే

పార్క్‌ను అభివృద్ధి చేయాలి



ఆరు దశాబ్దాలు చరిత్ర కలిగిన పార్క్ పొందూరు పట్టణ వాసులకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ప్రస్తుతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చిన్నారులు ఆడుకునేందుకు, వృద్ధులు సేద దీరేందుకు ఆహ్లాదం పంచే పార్క్‌ను బాగు చేయాలి.

– కోరుకొండ వెంకటసాయికుమార్, మాజీ ఎంపీటీసీ, పొందూరు

నిర్మాణాలు చేపడితే చర్యలు



ప్రహరీ నిర్మాణం చేపడుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

నరసన్నపేట: మండలంలోని దాసరివానిపేట స్కూల్‌కు ఎదురుగా ప్రహరీ నిర్మాణం చేపట్టే స్థలం పాఠశాలకు చెందినదేనని, ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల్లో పోరంబోకు స్థలంగా ఉందని, దీంట్లోనే పాఠశాల నిర్మాణం గతంలో చేపట్టడం జరిగిందన్నారు. ఈ స్థలంలో హక్కులు ఉన్నాయని చెప్పి ఇతరులు ప్రహరీ నిర్మాణం చేపట్టడం తగదన్నారు. ప్రహరీ నిర్మాణంపై గ్రామస్తులు ఎంఈఓకు ఫిర్యాదు నివ్వడంతో బుధవారం వెళ్లి పరిశీలించారు. వీరితోపాటు తెలగవలస వీఆర్వో పద్మలీల, సర్వేయర్ సర్వేయర్ హేమంత్, పంచాయతీ కార్యదర్శి పాట్నూరు సంతోష్‌కుమార్ వెళ్లి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అక్కడ పునాదులు వేసేందుకు తవ్విన స్థలం కూడా పాఠశాలకు చెందినదేనని అన్నారు. ఈ మేరకు రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చట్టవ్యతిరేకం అవుతుందన్నారు. అనధికారికంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్తంగా

గుండె పరిరక్షణపై అవగాహన

సారవకోట: గుండెను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని బుడితి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుజనీకుమారి అన్నారు. బుధవారం సీహెచ్‌సీలో గుండె రక్షణ, వచ్చే వ్యాధులు, సీహెచ్‌సీలో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో గుండె నొప్పితో ప్రాణాలు పోకూడదనే ఉద్దేశంతో స్టెమీ కార్యాక్రమం చేపడుతున్నామన్నారు. గుండె నొప్పి వస్తే సారవకోట సీహెచ్‌సీలో ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్నపిల్లల వైద్యులు చైతన్య, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

నరసన్నపేట: గుండె సంబంధిత జబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు అన్నారు. బుధవారం ఆస్పత్రిలో ఆశ వర్కర్లకు, ఏఎన్‌ఎంలకు, నర్సులకు, సిబ్బందికి గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. వైద్యులు జయశ్రీ, కృషి పాల్గొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్‌ను వైద్యులు ఆవిష్కరించారు.

అందుబాటులో నవధాన్యాల విత్తనాలు

పొందూరు రూరల్: నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి బసవ హైమావతి తెలిపారు. బుధవారం మండలంలోని తండ్యాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలు అవసరమైన రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. సిబ్బంది భాస్కరరావు, మల్లేసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు విరమించుకోవాలి

బూర్జ: బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోకపోతే మరో గిరిజన పోరాటానికి ఆదివాసీలు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. ఆదివాసులు సాగుచేస్తున్న పోడు వ్యవసాయం నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

17న అంగన్‌వాడీల ధర్నా

ఆమదాలవలస: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ కార్యదర్శి పి.భూలక్ష్మి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ అనురాధకు ధర్నా నోటీసు అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ నాయకులు కె.కృష్ణవేణి, కె.సునీత, జి.భారతి, ఎస్.ప్రమీల, ఎం.విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తిచేయాలి

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. ఆస్పత్రి ప్రహరీ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఆస్పత్రి ఏఓ రమణమూర్తి, ఇంజినీరింగ్ సిబ్బంది, కంట్రాక్టర్‌కు సూచనలు చేశారు.

విశిష్ట సంఖ్య నమోదు వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) కార్యక్రమం వేగవంతం చేయాలని గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులకు ఏఓ పైడి లతశ్రీ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 14 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు నంబర్‌ను పొందేందుకు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సొంత భూములు కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ..

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 21వ వార్డు కుద్దిరాం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధు చిరంజీవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈయనను వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. అండగా ఉంటామని బరోసా ఇచ్చారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, డి.చిరంజీవి, సాధు కామేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కూన రామకృష్ణ, బి.వి.రమణమూర్తి, సనపలరాజు, ముత్యాలు, సంపతిరావు రామారావు, నున్నగాపుల చిన్నారావు, బోర చంటి, పొన్నాడ చిన్నారావు, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యదాయకమైన పంటలు పండుతాయని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సిబ్బంది అన్నారు. మండలంలోని ఆంపురం గ్రామంలో బుధవారం రైతులకు పలు నూతన పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా (వేసవి పంట) వరి పొలంలో రాగిలైన్ పద్ధతి ద్వారా విత్తనశుద్ధి చేయడాన్ని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా శుద్ధిచేసిన నారును నాటితే అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడి తగ్గించడానికి బంతిమొక్కల పెంపకం, పక్షిస్థావరాల ఏర్పాటు, లైన్ షోయింగ్ విధానం ద్వారా మేలు కలుగుందన్నారు. రైతులు క్రమేపీ రసాయనిక ఎరువుల వినియోగానికి దూరం కావాలన్నారు.

19 మందిపై బైండోవర్



నిందితులను తహసీల్దార్ ముందు హాజరు పరచిన ఎస్ఈబీ పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని నవరపోలూరు, అప్పోజీపేట, దానుపురం, గొల్లబంజీరు గ్రామాల్లో 19 మంది నాటు సారా అక్రమంగా తయారుచేసి విక్రయించే వారిపై బుధవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్టు టెక్కలి ఎస్ఈబీ సీఐ మీరాసాహెబ్ తెలిపారు. మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాపారావు వద్ద హాజరు పరిచారు. ఇదే నేరంపై మరలా పట్టుబడిన వారికి జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తామన్నారు. రెవెన్యూ, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: మండలంలోని బోరుభద్ర గ్రామంలో గల అభయాంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేత్ర పరీక్షలు



నరసన్నపేట మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 48 మందికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు శ్రీనిజ, పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలగాధరరాజు, శంకర్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. – నరసన్నపేట

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు



సారవకోట మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు బుధవారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను చీడిపూడి, బుడితి, అవలింగి గ్రామాల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం అచ్చెన్నాయుడు కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేశారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – సారవకోట

గోతులమయం



ఆమదాలవలస మండలంలోని దూసి రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే గోతులు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. శ్రీకాకుళం మండలం రాగోలు నుంచి ఆమదాలవలస మండలం దూసి, తొగరాం, కొత్తవలస వరకు అధ్వానంగా ఉంది. ఈ రహదారి గుండా సుమారు 20 గ్రామాల ప్రజలు శ్రీకాకుళం పట్టణానికి నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – ఆమదాలవలస రూరల్

భక్తులందరికీ దర్శనం కల్పిస్తాం



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

జలుమూరు: ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శ్రీముఖలింగంలో నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలపై పూర్తిస్థాయి పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నామని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శ్రీముఖలింగం ఆలయ పరిసరాలు, గర్భగుడితోపాటు స్వామివారికి చివరి రోజున జరిగే చక్రతీర్థ సాన్నాలకు కావాల్సిన బందోబస్తు, తదితర సౌకర్యాలపై సిబ్బందితో మాట్లాడారు. సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్యూల ఏర్పాట్లు, చక్రతీర్థ సాన్నాలకు స్వామివారిని తీసుకువెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జలుమూరు, నరసన్నపేట, సారవకోట ఎస్ఐలు అశోక్‌బాబు, దుర్గాప్రసాద్, అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

100 రోజుల ఉపాధి కల్పనే ధ్యేయం

మెళియాపుట్టి: రెండుపూటలా పనులు చేయడం ద్వారా పూర్తిస్థాయి వేతనం లభిస్తుందని, మండలంలోని అన్ని గ్రామాల్లో లక్ష్యాల మేరకు ఉపాధి హామీ పనులు నిర్వహించాలని ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ద్వారా వేతనదారుల హాజరు వేయాలని, మార్చి ఆఖరు కల్లా జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని దినాలను పూర్తిచేయడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. శనివారం యుద్ధ ప్రాతిపదికన ఇంకుడు గుంతల పనులు ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. చేపల చెరువులు, ఫారం పాండ్స్, జీడిమామిడి తోటల్లో ట్రెంచ్‌ల పనులు వేగవంతం చేయాలన్నారు. సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మద్దతుగా నిలవండి



మాట్లాడుతున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న తనకు మద్దతుగా నిలిచి, విజయానికి సహకరించాలని అభ్యర్థి కె.విజయగౌరి ఉపాధ్యాయులను కోరారు. పాతపట్నం యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పి.మోహనరావు ఆధ్వర్యంలో స్థానిక ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని ఎంపీపీ మోడల్ స్కూల్‌లో బుధవారం యూటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విజయగౌరి మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. హెచ్ఎంలు వైకుంఠరావు, సింహాచలం, యూటీఎఫ్ మండల సభ్యులు కె.కవీశ్వరరావు, మద్దిల శంకరరావు, కె.కోటేశ్వరరావు, మామిడి షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా

మెళియాపుట్టి: విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం ఉండాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. బందపల్లి గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి, వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు కాస్మోటిక్స్, ఇతరత్రా సామగ్రి అందిస్తున్నారా, లేదా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వసతి గదులు, మరుగుదొడ్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యా బోధన సక్రమంగా జరగాలన్నారు. వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వెంకటాపురం, మర్రిపాడు–సి సచివాలయాలను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు.

నో సిగ్నల్

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం గ్రామంలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. యరగాం, తెలికిపెంట, చిన కాగితాపల్లి, ఇస్కలపాలెం పంచాయతీల్లోని సుమారు 15 గ్రామాల్లో 300 మంది వినియోగదారులు సిగ్నల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ టవర్ పనితీరును మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు.